క్లుప్తంగా

అలరించిన సినీ సంగీత విభావరి



గీతాలు ఆలపిస్తున్న కళాకారులు

డాబాగార్డెన్స్ : ప్రముఖ సాంస్కృతిక సంగీత సేవా సంస్థ మెలోడీ క్రియేటర్స్‌చే ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకుల్ని అలరించింది. చందురుని మించు అందమొలికించు పేరిట నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని కొణతాల రాజు, సత్యనారాయణ, ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, సోషల్ మీడియా ప్రతినిధి సన్‌మూర్తి, రాజశేఖర్, చీలా ఉషా, చెన్నా తిరుమల రావు, ప్రసాద్, మస్తాన్‌రెడ్డి, వర్రె నాంచారయ్య, కళాకారులు పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నగరానికి చెందిన సీనియర్ గాయకుడు పి. రాము అలనాటి తెలుగు చలన చిత్రాల్లోని పలు సినీ గీతాలను సహచర గాయనీ గాయకులతో మధురంగా ఆలపించారు. కార్యక్రమంలో మెలోడీ క్రియేటర్స్ అధ్యక్షుడు సీహెచ్‌వీ సత్యనారాయణ, కన్వీనర్ వి. ప్రభాకర్, ఎంఎస్ మాధవ్, గాయనీమణులు భాగ్యలక్ష్మి, సీవీ రాజేశ్వరి, సత్యవతి, లక్ష్మీసాత్విక, సత్యశ్రీ, శ్రీదేవి, రమణి, శైలజ, మాధురి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో ఉచిత సేవలు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలో పి.వి.సహాయ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథి జీవీఎంసీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నరేష్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆంధ్రా హాస్పిటల్, విశాఖ ఐ హాస్పిటల్‌కు చెందిన వైద్యులతోపాటు ఈఎన్‌టీ, కార్డియాలజీ, గైనకాలజీ, సాధరణ విభాగాలకు చెందిన నిపుణులు స్థానిక ప్రజలకు వైద్య సేవలందించారు. ఈసీజీ, కళ్లు, బీపీ, సుగర్, గుండె, చర్మ సంబంధిత వ్యాధులు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ పి.వి.వి.ఎస్.మూర్తి, సభ్యులు వి.సాంబశివరావు, వి.వి.రమణమూర్తి, పి.వి.ఎస్.ఎన్.మూర్తి, జి.సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రేపు ‘ఏపీ బాలల హక్కుల పరిరక్షణ’ సదస్సు



మాట్లాడుతున్న కేసలి అప్పారావు, సీతారాం

ఎంవీపీకాలనీ: ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉత్తరాంధ్ర జిల్లాల ప్రాంతీయ సదస్సు నిర్వహించనున్నట్లు కమిషన్ రాష్ట్ర చైర్మన్ కేసలి అప్పారావు వెల్లడించారు. ఎంవీపీ కాలనీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ఆదివారం కమిషన్ సభ్యుడి గొండు సీతారాంతో కలిసి ఆ వివరాలను వెల్లడించారు. మంగళవారం రాయ ల్ ఫోర్ట్ హోటల్లో ఈ ప్రాంతీయ సమావేశం జరుగుతుందన్నారు. బాలల హక్కుల పరిరక్షణకై తీసుకోవాల్సిన చర్యలపై ప్రధానంగా చర్చిస్తామన్నారు. స్త్రీ, శిశు సంక్షేమం, కార్మిక, విద్యా, పోలీస్, వైద్య ఆరోగ్య శాఖలతో పాటు బీసీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, సాంఘిక సంక్షేమ శాఖల ఉన్నతాధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్ర తినిధులు ఈ సమావేశంలో పాల్గొంటారన్నారు.

ఘనంగా పైడితల్లమ్మ తీర్థం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి, అడవివరం గ్రామ దేవత పైడితల్లి అమ్మవారి తీర్థ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. మహిళలు అమ్మవారికి పసుపుకుంకుమలు, చీరలు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లు చేశారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు అమ్మవారిని దర్శించుకున్నారు.



సూపర్.. వలంటీర్

సీఎం జగన్ దార్శనికత వలంటీర్లను నియమించటంతోనే స్పష్టమవుతోంది. బాపూజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం స్థాపించాలంటే ప్రతి ఒక్కరికి మేలు జరగాలన్న సత్యం గుర్తించిన ఆయన తానందించే సంక్షేమం ప్రతి ముంగిటకు చేరాలని భావించారు. అది వలంటీర్ వ్యవస్థతోనే సాధ్యమనుకున్నారు. ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను నియమించి.. ఆ ఇళ్ల మంచి చెడ్డలు తెలుసుకుని వారికి అవసరమైన సేవలందించేందుకు వలంటీర్లకు దిశా నిర్దేశం చేశారు. సీఎం మానసపుత్రికగా అభివర్ధించబడే వలంటీర్ వ్యవస్థ ఆయన తపనకు తగినట్లు.. ఆయన ఆశయ సాధన పరిపూర్ణమయ్యేటట్లు పని చేస్తూ ప్రజల మన్ననలు అందుకుంటోంది.

నజావుగా సేవలందిస్తున్నారని లబ్ధిదారుల ప్రశంస

పథకాలు అందేందుకు.. పెన్షన్ పొందేందుకు ఇక భయం లేదని హర్షం

అల్లిపురం : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకు వచ్చిన వలంటీర్ వ్యవస్థపై ప్రజలు ప్రసంశల జల్లు కురిపిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ప్రయోజనాలు అర్హులైన లబ్ధిదారులకు సజావుగా అందేందుకు వలంటీర్లు అలుపెరుగని కృషి చేస్తున్నారు. మహాత్మా గాంధీ ఆశయాల మేరకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ స్వరాజ్య స్థాపనకు కృషి చేస్తున్నారు. ఈ బృహత్తర కార్యంలో ఆయనకు వలంటీర్ వ్యవస్థ వెన్నుదన్నుగా నిలుస్తోంది. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు అభివృద్ధికి, సంక్షేమ పాలనకు సీఎం లక్ష్యం మేరకు పని చేస్తున్నారు.

వేనోళ్ల కొనియాడిన వృద్ధులు..

జీవీఎంసీ 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి చేపట్టిన గడప గడపకు మీ కార్పొరేటర్ కార్యక్రమంలో భాగంగా ఆమె ఇటీవల కొబ్బరితోటలో పర్యటించినప్పుడు ప్రజలంతా వలంటీర్ల పనితీరును వేనోళ్ల కొనియాడారు. ముఖ్యంగా వృద్ధులు తమకు చంద్రబాబు హయాంలో పింఛన్ దొరకడమే గగనమైపోయేదని వాపోయారు. అలాంటి సమయంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక వలంటీర్లు తొలిపొద్దు పొడవక ముందే ఇంటి తలుపు తట్టి తమకు పింఛన్ సొమ్ము అందిస్తున్నారని వలంటీర్లపై ప్రశంసల వర్షం కురిపించారు. వలంటీర్ల ద్వారా కుటుంబ సభ్యుడిలా తమ బాగోగులు తెలుసుకుంటున్న జగన్‌బాబు చల్లగా ఉండాలని.. మళ్లీ ఆయనే ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షించారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి ఏఎన్‌ఎంలు, వలంటీర్లు అందించిన సేవల పట్ల కృతజ్ఞతలు చెప్పుకున్నారు.



కొబ్బరితోటలో కార్పొరేటర్ పద్మావతితో కలిసి సేవలందిస్తున్న వలంటీర్లు, గృహ సారథులు (ఫైల్)

తెల్లారక ముందే పింఛన్ తెచ్చిస్తున్నారు..



నాలుగేళ్లుగా తెల్లారక ముందే 1వ తేదీన వలంటీర్ ఇంటికి వచ్చి పింఛన్ అందిస్తున్నారు. గత ప్రభుత్వంలో పింఛన్ చేతికందాలంటే వారం రోజులు పట్టేది. గంటల కొద్దీ లైన్లో నిల్చున్నా పింఛన్ అందుతుందన్న గ్యారంటీ ఉండేది కాదు. ఇప్పుడు మా బాగోగులు చూసుకోవడానికి జగన్‌బాబు వలంటీర్లను పెట్టడం వల్ల ఆ బాబు ఏదిచ్చినా వలంటీర్లు మాకు చక్కగా అందిస్తున్నారు.

– షేక్ సబీరా బేగం, కొబ్బరితోట

పథకాలకు దరఖాస్తు చేయించారు..



మా వలంటీర్ మాకు ఎంతో సహాయకారిగా ఉంటారు. రేషన్ కార్డులు, పెన్షన్, ఇతర పథకాలకు మాతో దరఖాస్తు చేయించారు. వైఎస్సార్ చేయూత కోసం వలంటీర్ మా ఇంటికి వచ్చి అన్ని కాగితాలు నింపి ఎక్కడికీ వెళ్లకుండానే నాకు చేయూత పథకం వచ్చేలా కృషి చేశారు. వలంటీర్ల సేవలు చాలా బాగున్నాయి. జగన్ బాబు వలంటీర్లను పెట్టి చాలా మంచి పని చేశారు. ఆయనకు ధన్యవాదాలు.

– యడ్ల బోడమ్మ, కొబ్బరితోట

ఏది కావాలన్నా వలంటీర్‌నే అడుగుతున్నాం..



ఆటో నడుపుతున్న నాకు ఏడాదికి ఒకసారి ఇన్సూరెన్స్ కట్టుకోవడం, ఆర్టీవో పనులు చేసుకోవడం ఇబ్బందిగా ఉండేది. అలాంటి సమయంలో వాహన మిత్ర పథకం ఆదుకుంది. ఆ పథకం కోసం మా వలంటీరే నాతో దరఖాస్తు చేయించారు. అన్ని కాగితాలు రాసి సచివాలయానికి తీసుకెళ్లి ఇచ్చారు. అదొక్కటే కాదు రేషన్ కార్డు, ఓటర్ ఐడీతో పాటు మా పిల్లలకు అవసరమైన ఎటువంటి సేవలైనా మా వలంటీర్ ద్వారానే మేము చేసుకోగలుగుతున్నాం.

– బొడ్డు ప్రసాద్, ఆటో డ్రైవర్

జగనన్న ముందు చూపునకు నిదర్శనం..



ఇంతకు ముందు మాకు ఏ పథకాలు అందలేదు. అసలు దేనికి ఎలా దరఖాస్తు చేసుకోవాలో తెలిసేది కాదు. జగనన్న ప్రభుత్వం వచ్చాక వార్డుల్లో వలంటీర్లను నియమించడంతో వాళ్లు వచ్చి మాతో అన్ని పథకాలకు దరఖాస్తు చేయించారు. అమ్మ ఒడి పథకం మా పిల్లలకి వచ్చేలా నాతో వలంటీర్ దరఖాస్తు చేయించారు. దీంతో ఆ డబ్బు వచ్చి మాకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. నిజంగా వలంటీర్ వ్యవస్థ గురించి ఆలోచించి అమలు చేయడం జగనన్న ముందు చూపునకు నిదర్శనం.

– బి.లక్ష్మి, కొబ్బరితోట

11న వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

డాబాగార్డెన్స్ : కురుపాం మార్కెట్ సమీపాన వెలసిన కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఈ నెల 11న వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆదివారం కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవీ కల్యాణ మండప సంఘం, వాసవీ విజ్ఞాన మండలి, వాసవీ సమాజం, ఆర్యవైశ్య వెల్ఫేర్ అసోసియేషన్, వాసవీ చైతన్య ఫౌండేషన్, వైశ్య స్టూడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ సంఘం అధ్యక్షుడు ఆరిసెట్టి దినకర్, కార్యదర్శి గ్రంధి రామకృష్ణారావు, కోశాధికారి సుగ్గు శివకుమార్ మాట్లాడుతూ ఆ రోజు వేకువ జాము 3 గంటలకు అమ్మవారి మూల విరాట్‌కు ప్రత్యేక క్షీరాభిషేకం, ఉదయం 7.30 గంటలకు అమ్మవారికి ప్రత్యేక ఆత్మార్పణ అలంకరణ, 8 గంటలకు ఉత్సవ విగ్రహానికి క్షీరాభిషేకం, 8.30 గంటలకు స్వర్ణపుష్పార్చన, 9.30 గంటలకు సామూహిక కుంకుమ పూజలు, 10.30కి వాసవీ హోమం నిర్వహించనున్నట్టు చెప్పారు. అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ కేఎంపీఎస్‌టీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


బహుముఖ ప్రజ్ఞాశాలి రాచకొండ నరసింహశర్మ




ఏవీఎన్ కళాశాలలో వందో జన్మదినోత్సవం జరుపుకుంటున్న డాక్టర్ రాచకొండ నరసింహశర్మ

డాబాగార్డెన్స్: ఏవీఎన్ కళాశాల పూర్వ విద్యార్థి, ప్రముఖ వైద్యుడు, కవి, రచయిత, అనువాదకుడు డాక్టర్ రాచకొండ నరసింహశర్మ శత జన్మదినోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ మొజ్జాడ సింహాద్రినాయుడు శర్మ వేడుకల్లో పాల్గొని ఆయన్ని ఘనంగా సత్కరించారు. వందో జన్మదినోత్సవం కళాశాలలో జరిపించడం ఆనందంగా ఉందని, రాచకొండను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రముఖ సాహితీవేత్త, బీవీకే కళాశాల విశ్రాంత ఆచార్యుడు డాక్టర్ డీవీ సూర్యారావు మాట్లాడుతూ డాక్టర్ రాచకొండ నరసింహ శర్మ వ్యక్తిత్వం మహోన్నతమైనదని, సాహిత్య రంగంలో విశేష ప్రజాదరణ పొందారని కొనియాడారు. ప్రముఖ న్యాయవాది రాచకొండ ఉమాకుమార్ శాస్త్రి మాట్లాడుతూ విద్యార్థులు నరసింహ శర్మ అడుగు జాడల్లో నడుస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల సహాయ ఆచార్యుడు డాక్టర్ కిలారి గౌరీనాయుడు మాట్లాడుతూ శర్మ సేవలను కొనియాడారు. తెలుగు–ఆంగ్ల భాషలకు నరసింహ శర్మ వారధి వంటి వారని, శతాధిక ప్రసిద్ధ ఆంగ్ల కవులను తెలుగు వారికి పరిచయం చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సదస్సు కన్వీనర్, కళాశాల తెలుగు విభాగం అధ్యక్షుడు పి.వెంకటరత్నం, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, డి.గాయత్రి నరసింహమూర్తి, శ్రీనివాస్, అర్చన, స్వరాజ్యలక్ష్మి, పైడి రజని తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న కేజీహెచ్ సిబ్బంది



అవగాహన కల్పిస్తున్న వాకర్స్ సభ్యులు

బీచ్ రోడ్డు: ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా కేజీహెచ్ అంకాలజీ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం సాగర తీరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆర్కే బీచ్ నుంచి వైఎంసీఏ వరకు సాగిన ఈ ర్యాలీని కేజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి ప్రారంభించారు. ఈ ర్యాలీలో 200 మందికిపైగా నర్సింగ్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు..

వాకర్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో..

వాకర్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని ఏరియా వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ డీడీ నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైనందిన జీవనంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి నడకను నిత్య వ్యాయామంగా మలచుకోవాలన్నారు. ఆహార నియమాలు పాటిస్తూ సకాలంలో గుర్తించి ప్రారంభదశలో చికిత్స అందించడం ద్వారా క్యాన్సర్ మహమ్మారిని జయించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కె.రంగారావు, పూర్వ గవర్నర్ ఉప్పలపాటి శుభ, తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థులకు పతకాలు

సింహాచలం: జీవీఎంసీ 98వవార్డు అడవివరం లోని మౌంట్ డియోస్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు కరాటే బెల్ట్ గ్రేడింగ్‌లో సత్తా చాటారు. కూర్మన్నపాలెంలో అకాడమీ ఆఫ్ షిటోరుయ్ కరాటే డూ ఇండియా(ఆస్కీ) ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం బెల్ట్ గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు మౌంట్ డియోస్ ఇంటర్నేషనల్ స్కూల్ నుంచి ఐదుగురు విద్యార్థులు హాజరయ్యారు.

బెల్ట్ గ్రేడింలో వామస్స్, సీటప్స్, పంచెస్, బ్లాక్స్, కిక్స్, స్టాండ్స్, కటస్ పరీక్షల్లో విద్యార్థులు శ్రీల, లీలా వైష్ణవి, లాలిత్య, దేవకి, ప్రణతి ఎల్లో బెల్ట్ సాధించారు. వీరికి నిర్వాహకులు బెల్ట్‌లు, సర్టిఫికెట్లు అందజేశారు. విద్యార్థులను మౌంట్ డియోస్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షురాలు, ఆర్‌టీఐ మాజీ కమిషనర్ ఎం.విజయనిర్మల, సొసైటీ సెక్రటరీ ముత్తంశెట్టి కృష్ణారావు, సీఈవో ముత్తంశెట్టి అఖిల, ప్రిన్సిపాల్ ఎవ. భార్గవి నాయక్ అభినందించారు.

చిరస్మరణీయుడు పుట్టా వెంకట్రావు



సంస్మరణ సభలో సంకీర్తనలు ఆలపిస్తున్న భక్తులు

డాబాగార్డెన్స్ : కుసుమ హరనాథ ఆశ్రమం, మందిరం ఏర్పాటు చేసిన పుట్టా వెంకట్రావు చిరస్మరణీయుడని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ కొనియాడారు. డాబాగార్డెన్స్‌లో గల కుసుమ హరనాథ ఆశ్రమంలో ఆదివారం పుట్టా వెంకట్రావు సంస్మరణ సభ నిర్వహించారు. సంకీర్తనలు, ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు వెంకట్రావు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎం. జగన్నాథరావు, ఆశ్రమ అధ్యక్షుడు బీవీ బాబాజీ, కార్యదర్శి ఆర్‌వీపీ రమేష్, సంయుక్త కార్యదర్శి కె. మంగరాజు, శివ, సీతారాం, నాని కృష్ణ, కుసుమ, సూర్యకుమారి, అధిక సంఖ్యలో భక్తుల పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమను కాపాడుకుంటాం



1,088వ రోజు దీక్షా శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు అనే నినాదంతో ఉద్యమ ఫలితంగా ఏర్పడిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం కాకుండా కాపాడుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న 1,088వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షల్లో ఆదివారం సంస్థకు చెందిన వివిధ విభాగాల కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కమిటీ నాయకులు మాట్లాడుతూ అమరవీరుల ప్రాణత్యాగంతో ఏర్పాటైన విశాఖ ఉక్కు పరిశ్రమను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరించడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన వైభవంగా నిర్వహించారు. అర్చకుడు రఘునాథ్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.

ఫిషింగ్ హార్బర్‌లో మహాశాంతి యజ్ఞం



హార్బర్‌లో మహాశాంతి యజ్ఞం చేస్తున్న సంఘం అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్

మహారాణిపేట : గత ఏడాది నవంబర్ 19వ తేదీన విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో సంభవించిన అగ్నిప్రమాదం మత్స్య పరిశ్రమపై తీవ్ర ప్రభావం చూపింది. అయితే ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. కానీ ఈ ఘటన జరిగిన తర్వాత చేపల వేట తగ్గుముఖం పట్టింది. ఈ నేపథ్యంలో హార్బర్‌ను కాపాడాలని కోరుతూ గంగాదేవి ఆశీస్సుల కోసం ఈరోజు నుంచి మూడు రోజుల పాటు ఫిషింగ్ హార్బర్‌లో శ్రీ జటా రుద్ర రాజశ్యామల జటా గంగేశ్వర మహా శాంతి యజ్ఞం ప్రారంభించారు. ఏపీ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్ ఆధ్వర్యంలో ఘనంగా ఈ కార్యక్రమం ప్రారంభమైంది. మూడురోజుల పాటు జరిగే ఈ వేడుక మంగళవారం ముగుస్తుంది. ఆ రోజు సాయంత్రం 3 గంటల నుంచి మత్స్యకార మహిళలు కలశాలతో అమ్మవారి దేవాలయం నుంచి బయలుదేరి ప్రమాదం జరిగిన స్థలం వద్దకు చేరుకుంటారు. అక్కడ గంగమ్మ తల్లికి పూజలు, గంగా హారతి నిర్వహించి అమ్మవారికి కలశాభిషేకం చేస్తారు. హార్బర్‌లో జరిగిన ప్రమాద ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. మత్స్యకారులను కాపాడి, మత్స్య పరిశ్రమ పునర్జీవం పోసుకుని వ్యాపార కార్యకలాపాలు యథావిధిగా సాగడానికి గంగాదేవి ఆశీస్సులు అవసరమని జానకిరామ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు దూడ పోలయ్య, గుంటు దానయ్య, ప్రధాన కార్యదర్శి మైలపల్లి లక్ష్మణరావు, కోశాధికారి మైలపల్లి నరసింహులు, సభ్యులు గణగళ్ల రాజేష్, పోతయ్య, మైలపల్లి మసేను, ఎస్.రాము, యాగ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

140 కిలోల గంజాయి పట్టివేత

- స్పెషల్ బ్రాంచ్ సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు
- కారు సీజ్



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి



సీజ్ చేసిన కారు

సీతమ్మధార: గుట్టుచప్పుడు కాకుండా పాడేరు నుంచి నగరానికి తరలిస్తున్న గంజాయిని స్పెషల్ బ్రాంచ్ పోలీసుల సహకారంతో ఫోర్త్‌టౌన్ పోలీసులు పట్టుకున్నారు. వివరాలిలా.. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు నుంచి ఏపీ39 ఎస్‌క్యూ 2485 నంబర్ గల కారులో గంజాయి తీసుకొచ్చి నగరంలోని తాటిచెట్లపాలెం 80 ఫీట్ రోడ్డులో గల కేంద్రీయ విద్యాలయం వెనుక గేటు వద్ద పార్క్‌చేసి వెళ్లిపోయారు. స్పెషల్ బ్రాంచ్ అధికారులతో పాటు ఏఎస్‌ఐ ఎం.గురునాథ్, హెడ్ కానిస్టేబుల్ కె.ఎస్. నాయుడు సమాచారంతో ఫోర్త్‌టౌన్ సీఐ విజయకుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆదివారం రాత్రి 10.30 గంటల సమయంలో ఒక వ్యాన్ సహాయంతో ఆ కారును ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. అందులో 70 ప్యాకెట్ల గంజాయి (140 కిలోలు) ఉన్నట్లు గుర్తించారు. కారును సీజ్ చేసి, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు వ్యక్తులు పరారైనట్లు గుర్తించిన పోలీసులు సీసీ ఫుటేజ్‌లు పరిశీలిస్తున్నారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

బీజేపీని గద్దె దించాలి

సీతంపేట: దళిత, లౌకిక బహుజన శక్తులన్నీ కలిసి రానున్న ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ) జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మోహన్‌లాల్ పాటిల్ పిలుపునిచ్చారు. రామాటాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం జరిగిన పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ హయాంలో అణగారిన కులాలపై కుట్ర జరుగుతోందని, వీరి హక్కులను కాలరాస్తున్నారన్నారు. పార్టీ దక్షిణ భారత కార్యనిర్వాహక అధ్యక్షుడు పి.అంజయ్య, ఏపీ అధ్యక్షుడు ఎస్.డేవిడ్‌రాజు, కార్యదర్శి పిట్టా వరప్రసాద్, సీనియర్ నాయకులు మట్టా వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబకు నవమి పూజలు



ఎర్నిమాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

కంచరపాలెం : జ్ఞానాపురంలోని కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం పుష్య మాస శుద్ధ నవమి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ పరిసరాల్లో వంటా వార్పు చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్, తదితర సిబ్బంది సౌకర్యాలను పర్యవేక్షించారు.

త్రినాథ్ ఎంపిక పట్ల హర్షం



త్రినాథ్‌ను సన్మానిస్తున్న టైలర్లు

మహారాణిపేట : న్యూ నవ్యాంధ్ర రాష్ట్ర టైలర్స్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఈ.త్రినాథ్‌ను ఎన్నుకోవడం పట్ల పలువురు సంతోషం వ్యక్తం చేశారు. ఆదివారం మహారాణిపేట టైలర్ సంఘం కార్యాలయంలో త్రినాథ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.